క్లుప్తంగా

క్రీడా పోటీలు ప్రారంభం


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ బండి కృష్ణగౌడ్

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని ఇంద్రియాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎన్విరాన్‌మెంటల్ అండ్ పబ్లిక్ స్కూల్స్ తెలుగు అసోసియేషన్, డాక్టర్ రమేశ్ శీలా, శాంతిరెడ్డి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీవాల్, కబడ్డీ, షటిల్ పోటీలను శుక్రవారం మాజీ సర్పంచ్ బండి కృష్ణగౌడ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చందా సుధాకర్‌రెడ్డి, హెచ్‌ఎం గురునాథం, మాజీ ఎంపీటీసీ ఎం. యాదగిరి, చింతల రామకృష్ణ, గరిసె జంగయ్య, ఉడుతల వాసుదేవ్, శెట్టి మల్లేశ్, కోచ్‌లు యూసూఫ్, అనురాగ్‌కుమార్, శ్రీహరి పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్మికులు

భువనగిరిటౌన్ : మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న 350మంది కార్మికులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని బీఆర్‌ఎస్ పట్టణ శాఖ అధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీ అధ్వర్యంలో మున్సిపల్ కార్మికులతో కలిసి కలెక్టర్ హనుమంతరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి నెల నుంచి ఇప్పటివరకు వేతనాలు చెల్లించలేదన్నారు. వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు తరలిరావాలి


ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నాయకులు

భువనగిరిటౌన్ : పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహావిష్కరణకు తరలిరావాలని సీపీఎం పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ అన్నారు. ఈ నెల 19న నిర్వహించనున్న సుందరయ్య విగ్రహావిష్కరణకు రావాలని కోరుతూ శుక్రవారం చిలుకూరి రామచంద్రారెడ్డి తల్లి సుశీలకు ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బండి రవి, పర్వత్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ ఏర్పాటుకు శంకుస్థాపన

మోత్కూరు : మున్సిపాలిటీ పరిధిలోని ధర్మాపురం గ్రామంలో దాతలు ఎగమాటి రాంరెడ్డి, పల్లెర్ల వెంకన్న సహకారంతో ఏర్పాటు చేస్తున్న వాటర్ ప్లాంట్‌కు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పైళ్ల సోమిరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి జినకుల కనకయ్య, కాంగ్రెస్ నాయకులు వర్రె వెంకటయ్య, వర్రె లింగయ్య, నంది కృష్ణారెడ్డి, నల్ల లింగయ్య, ఎల్లంల మదర్, అంబటి రాజు, జినుకల మధు, వర్రె సురేష్, వేముల మహేష్, ఏనుగుల నరసింహ, జినుకల నిఖిల్, వర్రె మణికాంత్ పాల్గొన్నారు.

అన్నెపు వెంకట్‌కు సన్మానం

మోత్కూరు : ఆల్ స్టైల్ కరాటే అసోసియేషన్ యాదాద్రి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన అన్నెపు వెంకట్ ను శుక్రవారం మోత్కూరు జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో స్టాండర్డ్ షిటూరియో ఇంటర్నేషనల్ కరాటే ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కనుకు రాజు, పురుగుల శ్రీను, చొల్లేటి నరేష్, బాసోజు విష్ణుచారి, చేతరాశి వెంకన్న, నిమ్మల నరేష్, పెండెం వెంకటేశ్వర్లు, రిటైర్డ్ డిప్యూటీ తహసీల్దార్ మన్నె అంజయ్య పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

అడ్డగూడూరు : మండలంలోని జానకీపూరం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కొప్పుల మోహన్ రెడ్డి భార్య కొప్పుల సుజాత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ శుక్రవారం ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చొల్లరామారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ యువజన మండ నాయకుడు తోట నవీన్ తండ్రి తోట కిష్టయ్య ఇటీవల మృతి చెందారు. కిష్టయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ దర్శనాల అంజయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ పోగుల నర్సిరెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ చిప్పలపల్లి మహేంద్రనాథ్, నాయకులు భాస్కర్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, నరేందర్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా నీటి ట్యాంకులు

సంస్థాన్ నారాయణపురం : ప్రజల నీటి అవసరాలను తీర్చేందుకు కోట్ల రూపాయల నిధులతో మండలంలోని పలు గ్రామాల్లో నిర్మించిన మంచి నీటిట్యాంకులు ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. మండలంలో ఫ్లొరైడ్‌శాతం ఎక్కువగా ఉండడంతో ప్రజలకు కృష్ణా జలాలు అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వాలు మండలవ్యాప్తంగా 30వేలు, 40వేలు, 50వేల లీటర్ల నీటి సామర్థ్యం సుమారు 240కి పైగా వాటర్ ట్యాంకులను నిర్మించాయి. ఈ ట్యాంకుల ద్వారా గ్రామాల్లో కృష్ణా జలాల సరఫరా జరిగేది. అయితే ఈ నీటి ట్యాంకులను ప్రస్తుతం వినియోగించకపోవడంతో అవి శిథిలావస్థకు చేరుతున్నాయి.

రోజురోజుకూ పెరుగుతున్న నీటి సమస్య

ఎండలు ముందురుతుండడంతో ఇప్పటికే భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. దీంతో పల్లెల్లో నీటి సమస్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంకులకు మరమ్మతులు చేయించి నీటి ట్యాంకులు ఉపయోగిస్తే నీటి ఎద్దడి సమయంలో ఉపయోగపడే అవకాశం ఉందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంకులను వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


అరెగూడెంలో నిరుపయోగంగా ఉన్న నీటిట్యాంకు


గంగమూలతండాలో..


జనగామాలో..

వినియోగంలోకి తేవాలి



భూగర్భ జలాలు అడుగంటడంతో గ్రామంలోని స్కీం బోరు సరిగా పోయడం లేదు. తాగునీటికి ఇబ్బంది అవుతుంది. గ్రామంలో నిరుపయోగా ఉన్న నీటిట్యాంకును ఉపయోగంలోకి తీసుకురావాలి. నీటి ఎద్దడి సమయంలో ఈ ట్యాంకులు నీటి సరఫరాకు ఎంతో ఉపయోగపడే అవకాశం ఉంది.

– కె. బాలు, గంగమూలతండా

డంపింగ్‌యార్డుగా ఓపెన్ జిమ్


చెత్తకుప్పల మధ్యన ఉన్న ఓపెన్ జిమ్

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని పిలాయిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ డంపింగ్‌యార్డుగా తయారైంది. గత ప్రభుత్వ హయాంలో రూ. 3 లక్షల వ్యయంతో గ్రామ శివారులోని కుంట పక్కన సమాధులు, పెంటకుప్పల మధ్యన ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. గ్రామస్తులు పెంట, చెత్తను తెచ్చి ఓపెన్‌జిమ్ ప్రాంతంలో పారబోస్తున్నారు. దీంతో చెత్తకుప్పల దుర్గంధాలతో ఓపెన్ జిమ్ దర్శనమిస్తుంది. దీంతో ఓపెన్ జిమ్‌కు ఎవరూ వెళ్లకపోవడంతో నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఓపెన్‌జిమ్‌ను వేరే ప్రదేశంలో ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

వలిగొండ : హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని రెడ్లరేపాకకు చెందిన మహ్మద్ ఖాజాను శుక్రవారం ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ జానీ, మాద లావణ్య శంకర్ గౌడ్, గోదా రాహుల్ గౌడ్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి


బొమ్మలరామారం : కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్


తుర్కపల్లి : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న చైర్ పర్సన్ ఐనాల చైతన్య


గుండాల : వెల్మజాలలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

బొమ్మలరామారం : ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని తహసీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని నాగినేనిపల్లి, రామలింగంపల్లి, మేడిపల్లి, మైలారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. హామాలీలు, ట్రాన్స్‌పోర్ట్ కోసం లారీల సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ గూదే బాల్ నర్సింహ, ఏఈఓ మౌనిక రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తాం

తుర్కపల్లి : రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తామని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఐనాల చైతన్య మహేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పెద్దతండా లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఇబ్బందులు లేకుండా దాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. తూకం వేసిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా లారీల ద్వారా మిల్లర్లకు సరఫరా చేయాలన్నారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

గుండాల : తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు పింగళి విజయ్‌భాస్కర్ రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని వెల్మజాల గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ప్రభుత్వం కొనుగోళ్లను వేగవంతం చేయక పోవడంతోనే అకాల వర్షానికి ధాన్యం తడిసి రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నిమ్మల అవినాశ్‌రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, కార్తీక్ యాదవ్, సాయి, అరుణ్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కార్యకర్తలు కృషిచేయాలి


మాట్లాడుతున్న పులి అనిల్‌కుమార్

మోత్కూరు : గ్రామ స్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అబ్జర్వర్ పులి అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని పాటిమట్ల ఎక్స్ రోడ్డులోని ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం తుంగతుర్తి నియోజకవర్గ స్థాయి క్రియాశీలక కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో గ్రూపులకు తావు లేదని, అందరూ ఒక్కటేనన్నారు. కష్టపడి పని చేసే క్రియాశీలక కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ కంచర్ల యాదగిరిరెడ్డి,వంగాల సత్యనారాయణ, జోజి, పైళ్ల సోమిరెడ్డి, రామచంద్రు గౌడ్, ఎ.లక్ష్మీనర్సింహా రెడ్డి, మల్లారెడ్డి, నర్సిరెడ్డి, ముద్దం జయశ్రీ, గుండిగ జోసఫ్ పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి


భువనగిరి : మాట్లాడుతున్న అమీన్‌బాబా



రామన్నపేట : మాట్లాడుతున్న ఎంఈఓ జ్యోతి

భువనగిరి : క్రికెట్‌సమ్మర్ క్యాంప్‌నుసద్వినియోగం చేసుకోవాలని క్రికెట్ అసోసియేషన్ ఉమ్మడి నల్లగొండ జిల్లా సెక్రటరీ అమీన్ బాబా అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ఉచిత క్రికెట్ సమ్మర్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులకు క్రీడా సామాగ్రిని అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన బోయిన అంజనేయులు, అధ్యశ్రీ, ఏవీ కిరణ్‌కుమార్, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, కోచ్‌లు రావుల సతీష్, కేతన్, వినోద పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

రామన్నపేట: మండలంలోని వెల్లంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ఎంఈఓ గవ్వ జ్యోతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల కేంద్రంతో పాటు వెల్లంకి, ఇంద్రపాలనగరం గ్రామాల్లో శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు టి.సురేందర్‌రెడ్డి ఉపాధ్యాయులు ఎస్.సీనా రెడ్డి, పారిజాత, ఉమామహేశ్వరి, స్వప్న, హేమలత, పీడీ రేణుక వసంత పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి

ఆత్మకూరు(ఎం) : బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మిర్యాల దామోదర్, కట్టా రమేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని కూరెల్లలో బడిబాట నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న ప్రదేశంలో ప్రచారం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎస్ఎంసీ చైర్మన్ గడ్డం అశోక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలడుగు ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో..

మోత్కూరు : మండలంలోని పాలడుగు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల ఆధ్వర్యంలో శుక్రవారం బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న వసతులను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కమలాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు వెంకటగిరి, ప్రశాంతి, రాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

అడ్డగూడూరు : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ప్రధానోపాధాయులు రాజ్యవర్ధన్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కోటమర్తి ల్లా పరిషత్ ఉన్న పాఠశాల ఆధ్వర్యంలో శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పదో తరగది పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఏపీసీ చైర్మన్ చిత్తలూరి సరిత వెంకన్న, ఉపాధాయులు, రామచంద్ర రెడ్డి, సైదులు, రామచంద్రు, రామదాసు, మాజీ సర్పం బాలు, మాజీ ఎంపీటీసీ పాశం సత్యానారాయణ పాల్గొన్నారు.



మోత్కూరు : పాలడుగులో బడి బాట కార్యక్రమం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు


ఆత్మకూరు(ఎం): ఉపాధి హామీ కూలీలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు


అడ్డగూడూరు : కోటమర్తిలో విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సాగునీటిని పొదుపుగా వాడుకోవాలి


మాట్లాడుతున్న శాస్త్రవేత్త బలరామ్

చౌటుప్పల్ : సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని ప్రొఫసర్ జయశంకర్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు డాక్టర్ బలరామ్, డాక్టర్ కృష్ణ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లిలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరిలో పిలక దశ వరకు ఆరుతడిలో నీటిని అందిస్తే పిలకలు అధికంగా వచ్చి రైతులకు అధికంగా ఆదాయం సమకూరుతుందన్నారు. వరిలో మూడు దఫాలుగా, పత్తిలో నాలుగు దఫాలుగా యూరి యాను వినియోగించాలన్నారు. రైతాంగం వీలైనంత మేరకు పంటల మార్పిడి చేసుకోవాలని సూచించారు. అవసరం ఉంటే తప్పిస్తే రసాయన ఎరువులను వినియోగించొద్దన్నారు. మేలైన విత్తన వంగడాల కోసం ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, ఏఓ ముత్యాల నాగరాజు, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

సదా ప్రవీణ్‌కుమార్‌కు నివాళి

యాదగిరిగుట్ట: బీఆర్‌ఎస్ యువజన నాయకుడు సదా ప్రవీణ్ కుమార్ ముదిరాజ్ రోడ్డు ప్రమాదంలో గురువారం రాత్రి మృతి చెందాడు. శుక్రవారం ఆయన మృతదేహాన్ని పలువురు సందర్శించి నివాళులర్పించారు. ప్రవీణ్ కుమార్ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. నివాళులర్పించిన వారిలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కల్లూరి రాంచంద్రారెడ్డిలతో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


వలిగొండ : విద్యార్థులకు కోడి గుడ్లు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న సలీం పాషా

వలిగొండ : క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని యువజన సమితి రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ సలీమ్ పాష అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించారు. విద్యార్థులకు కోడి గుడ్లు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పోలేపాక బిక్షపతి, నాగేల్లి వలి, శ్రీకాంత్, వెంకట్, వెంకటేశం, స్వామి రాజ్, మల్లేశం, సాయి కుమార్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత


పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట రూరల్: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. మండలంలోని దాతర్‌పల్లి గ్రామంలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కాల్నె భాస్కర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవ కరపత్రం ఆవిష్కరణ


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆలయ చైర్మన్, నాయకులు

ఆలేరు : పట్టణంలోని శ్రీ దుర్గామాత దేవాలయ వార్షికోత్సవానికి సంబంధించిన కరపత్రాన్ని శుక్రవారం ఆలయ చైర్మన్ కొలుపుల హరినాథ్ ఆవిష్కరించారు. అనంతరం కుల సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. వచ్చే నెల 4,5,6 తేదీల్లో నిర్వహించనున్న ఆలయ వార్షికోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం తరపున వార్షికోత్సవ వేడుకలకు రూ.21వేల విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పైపులైన్ పరిశీలన

వలిగొండ : మండల కేంద్రంలోని పాత తహసీల్దార్ కార్యాలయం సమీపంలో గోదావరి జలాల పైపులైన్ లీకేజీ కారణంగా నీరు వృథా పోతున్న నీటిని శుక్రవారం సీపీఎం నాయకులు పరిశీలించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, నర్సింహ, కొండూరు సత్తయ్య, మునుకుంట్ల ధనుంజయ్య, కీర్తి రమేష్, బత్తిని శేఖర్, కొండూరు పాండు, పోలేపాక శంకర్ పాల్గొన్నారు.

ఎక్కడపడితే అక్కడే పార్కింగ్


ఆలేరు బస్టాండ్ ఎదుట రోడ్డుపైనే పార్కింగ్ చేసిన వాహనాలు

ఆలేరురూరల్ : ఆలేరు మున్సిపల్ కేంద్రంలోని ప్రధాన రహదారులన్నీ పార్కింగ్ అడ్డాలుగా మారాయి. మంతపురి రోడ్డు నుంచి దుర్గమ్మ గుడి వరకు వాహనాదారులు ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేస్తుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అసలే ఇరుకు రోడ్లు.. ఆపై ద్విచక్రం వాహనాల పార్కింగ్‌తో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. సాయంత్రం సమయాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉండడం.. తోపుడు బండ్లు రోడ్డుపైన నిలపుతుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. పోలీసులు స్పందించి రోడ్లపైన వాహనాలు పార్కింగ్ చేయకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డుపై గుంత.. కర్రే సూచిక


ప్రమాదకరంగా ఉన్న గుంతలో పాతిన కర్ర

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని శివారెడ్డిగూడెం శివారులోని మెయిన్‌రోడ్డుపై ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. గ్రామ శివారులోని కల్వర్టు వద్ద మెయిన్‌రోడ్డుపై కల్వర్టు లోపలి వరకు గొయ్యి ఏర్పడింది. వాహనదారులు గమనించక ప్రమాదాల బారిన పడుతున్నారు. నిత్యం ఈ మార్గం గుండానే అధికారులు వెళ్తున్న పట్టించుకోవడం లేదు. ప్రమాదకరంగా మారిన గుంతను పూడ్చాలని ఇటీవల సీపీఎం నాయకులు ధర్నా చేసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో స్థానికులే రోడ్డుపై ఏర్పడిన గుంతలో కర్ర పాతి దానికి ఎరుపురంగు కవరు కట్టి ప్రమాద హెచ్చరికగా ఉంచారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతను పూడ్చాలని కోరుతున్నారు.

మరమ్మతులు చేసేదెవరు?


గుండాలలో ధ్వంసమైన చేతి పంపు

గుండాల : ప్రజల దాహార్తి తీర్చేందుకు గత ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చేతి పంపులు పనిచేయడం లేదు. మరమ్మతులు చేపట్టక పోవడంతో గ్రామాల్లో ఉన్న చేతి పంపులు తుప్పు పట్టి పోతున్నాయి. వేసవిని దృష్టిలో పెట్టుకొని చేతి పంపులకు మరమ్మతులు చేపట్టి ఉపయోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.